నమస్తే తెలంగాణ
కరీంనగర్
5 | కరీంనగర్, ఆదివారం 15 సెప్టెంబర్ 2024 | KARIMNAGAR

ఫుట్‌పాత్‌పైనే కార్ల రిపేర్

కరీం'నగరం'లో ఫుట్‌పాత్‌లు కనుమరుగవుతున్నాయి. టవర్ సర్కిల్ ఏరియాలోనే కాదు, ఎక్కడ చూసినా ఆక్రమణలకు గురవుతున్నాయి. చాలా వరకు షాపుల ఎదుట ఆక్రమిస్తుండగా.. నిత్యం బిజీగా ఉండే కలెక్టరేట్ ప్రధాన రహదారిలో ఏకంగా కొద్ది రోజుల నుంచి ఫుట్‌పాత్‌పైనే కార్లు రిపేర్ చేస్తున్నారు. వివిధ పనుల కోసం కలెక్టరేట్‌కు వెళ్లే పాదచారులు, ఇటుగా వెళ్లే విద్యార్థులు ఇబ్బంది పడుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. **- కరీంనగర్, స్టాఫ్ ఫొటోగ్రాఫర్**

ఎమ్మెల్సీ పదవి కోసం
పంతుళ్ల ప్రయత్నాలు!

అప్పుడే రంగంలోకి ఆశావహులు

- ఈ నెల 30 నుంచి ఎన్‌రోల్‌మెంట్ ప్రారంభం
- గతంలో కన్నా ఓట్లు పెరిగే అవకాశం
- పోటాపోటీగా ఉపాధ్యాయసంఘాల నాయకులు
- దీటైన అభ్యర్థులను దింపేందుకు చూస్తున్న ప్రధాన పార్టీలు
- ఆచితూచీ ఓటు వేసే దిశగా ఉపాధ్యాయుల అడుగులు

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పదవి కోసం పంతుళ్లు అప్పుడే తమ ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఎలాగైనా సీటు దక్కించుకోవాలన్న ఉద్దేశంతో ఆశావహులు ముందుకెళ్తున్నారు. 2019తో పోలిస్తే ఈసారి పోటీ అధికంగా ఉండే అవకాశమున్నది. అలాగే ఓటర్ల సంఖ్య కూడా పెరుగనున్నది. ఈ నేపథ్యంలో ఔత్సాహిక నాయకులు ఇప్పటి నుంచే తమ వ్యూహాలను అమలు చేస్తున్నారు. కొంత మంది బాహాటంగా బయటకు వచ్చి ఒకవైపు ఆయా సంఘాలు, ప్రధాన పార్టీల మద్దతు కోసం ప్రయత్నిస్తుండగా.. మరికొంత మంది అంతర్గతంగా ప్రయత్నాలు, ప్రచారం సాగిస్తూ ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు సన్నద్ధమవుతున్నారు. అయితే, ఈ విషయం ఉపాధ్యాయవర్గాల్లో హాట్ టాపిక్‌లా మారగా, ఈసారి అన్ని కోణాల్లో ఆలోచన చేసి ఓటు వేయాలన్న చర్చ నడుస్తున్నది.

కరీంనగర్, సెప్టెంబర్ 14 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కరీంనగర్-మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ పాత ఉమ్మడి జిల్లాకు సంబంధించిన పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు అతి త్వరలో జరగనున్నాయి. అందుకోసం తాజాగా ఉత్తర్వులు జారీ అయిన విషయం తెలిసిందే. అంతేకాదు, ఈ నెల 30 నుంచి ఓటర్ల నమోదు కార్యక్రమం ప్రారంభం కానున్నది. ప్రస్తుతం పట్టభద్రుల ఎమ్మెల్సీగా టీ జీవన్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా కూర రఘోత్తం రెడ్డి కొనసాగుతున్నారు. రెండు ఎమ్మెల్సీలకు సంబంధించి 2019 మార్చిలో ఎన్నికలు జరిగాయి. అందులో పట్టభద్రుల స్థానానికి ఆనాడు 17 మంది పోటీ చేయగా, ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి ఏడుగురు పోటీ పడ్డారు. అప్పుడు పట్టభద్రుల ఎమ్మెల్సీగా కాంగ్రెస్‌కు చెందిన జీవన్‌రెడ్డి బీఆర్ఎస్ మద్దతు ఇచ్చిన చంద్రశేఖర్‌గౌడ్‌పై విజయం సాధించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి సంబంధించి పాతూరి సుధాకర్‌రెడ్డిపై 1,707 ఓట్లతో పీఆర్టీయూ మద్దతుదారుడు కూర రఘోత్తం రెడ్డి విజయం సాధించారు. వీరి పదవీ కాలం వచ్చే ఏడాది మార్చి 29తో ముగియనుండగా, ఎన్నికలు నిర్వహించేందుకు ఇప్పటికే ఆదేశాలు జారీ అయ్యాయి. అందులో భాగంగానే ఈనెల 30వ తేదీ నుంచి ఈ నాలుగు ఉమ్మడి జిల్లాల పరిధిలో ఓటర్ నమోదు ప్రక్రియ కొనసాగించేందుకు ప్రకటన జారీ అయింది. దీంతో ఔత్సాహిక నాయకులంతా.. ఎవరికి వారు తమ ప్రయత్నాల్లో ఉన్నారు. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయ సంఘాలకు చెందిన పలువురు నేతలు.. ఈ పదవి కోసం పోటీ పడేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టారు. ఒకవైపు ఉపాధ్యాయ సంఘాలు పోటీపడుతుండగా.. మరోవైపు ప్రధాన పార్టీలు సైతం బలమైన అభ్యర్థులను రంగంలోకి దింపాలన్న ఆలోచన చేస్తున్నాయి.

పాగా వేసేందుకు ప్రయత్నాలు

ప్రస్తుత ఉపాధ్యాయ ఎమ్మెల్సీ సిద్దిపేట జిల్లాకు చెందిన కూర రఘోత్తం రెడ్డి మరోసారి ఎన్నికల బరిలో నిలిచేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ సారి సైతం ఆయన పీఆర్టీయూ మ్యాండేట్ (మద్దతు) కోసం మళ్లీ ప్రయత్నాలు ఆరంభించారు. అలాగే సిద్దిపేటకు చెందిన వంగ మహేందర్‌రెడ్డి రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా సుదీర్ఘ కాలం పనిచేశారు. 20 సంవత్సరాల పాటు స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేసి వలంటరీ రిటైర్మెంట్ తీసుకున్నారు. వీఎంఆర్ ఫౌండేషన్ ద్వారా ఆయన అనేక స్వచ్ఛంద కార్యక్రమాలు చేస్తున్నారు. ప్రస్తుతం పీఆర్టీయూ మద్దతు కోసం ప్రయత్నాలు చేస్తున్నారు.

అలాగే నిజామాబాద్ జిల్లాకు చెందిన బీరెల్లి కమలాకర్ రావు పీఆర్టీయూ మద్దతు కోసం ప్రయత్నం చేస్తున్నారు. ఆయన గతంలో నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడిగా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఆరేళ్లు పనిచేసి ఆగస్టులో పదవీ విరమణ పొందారు. అలాగే జాలిమహేందర్‌రెడ్డి కరీంనగర్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా పని చేశారు. పంచాయత్‌రాజ్ ఉపాధ్యాయ మాసపత్రిక సంపాదక వర్గ సభ్యులుగా పనిచేసిన మహేందర్‌రెడ్డి, పీఆర్టీయూ మద్దతుతో బరిలో నిలిచేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇదిలా ఉండగా.. ఉపాధ్యాయ జాయింట్ యాక్షన్ కమిటీ (జాక్టో) అలాగే ఉపాధ్యాయ సంఘాల పోరాట సమితి (యూఎస్‌పీఎస్) ఈ రెండు కూటముల నుంచి ఒక్కో బలమైన అభ్యర్థిని బరిలో దించేందుకు చర్చలు జరుగుతున్నట్టు సమాచారం.

ఇక ప్రధాన పార్టీల పరంగా చూస్తే.. వివిధ ఉపాధ్యాయ సంఘాల్లో పనిచేసి అనుభవం ఉన్న ముగ్గురు నాయకులు బీఆర్ఎస్ మద్దతు కోరుతున్నట్టు విశ్వసనీయ సమాచారం. త్వరలోనే ఈ పేర్లు కూడా బయటకు వచ్చే అవకాశమున్నది. కాగా కరీంనగర్‌కు చెందిన పీఆర్టీయూ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి ప్రస్తుతం బీజేపీలో నార్త్ జోన్ ఇన్‌చార్జిగా పనిచేస్తున్న నరహరి లక్ష్మారెడ్డి బీజేపీ మద్దుతుతో పోటీలో నిలబడేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండిసంజయ్‌తోపాటు బీజేపీ ప్రధాన నాయకులను కలిసి, ఈసారి తనకు అవకాశం ఇవ్వాలని కోరుతూ దరఖాస్తు చేశారు. అలాగే కరీంనగర్‌కు చెందిన పూలు సత్యనారాయణ అనే రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు పలు స్వచ్ఛంద కార్యక్రమాలు చేస్తున్నారు. ఆయన కూడా బీజేపీ మద్దతు కోసం ప్రయత్నిస్తున్నారు. పార్టీ పెద్దలను కలిసి తనకు అవకాశం ఇవ్వాలని కోరారు. అలాగే 2019 ఎన్నికల్లో ఎస్టీయూ మద్దతుతో పోటీచేసిన మామిడి సుధాకర్‌రెడ్డి ఆ ఎన్నికల్లో మూడో స్థానంలో నిలిచారు. ఆయన కూడా ఈసారి బీజేపీ మద్దతు కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రస్తుత టీపీసీసీ అధికార ప్రతినిధి, తెలంగాణ పీఆర్టీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు గాలి రెడ్డి హర్షవర్ధన్ రెడ్డి ఎమ్మెల్సీ బరిలో నిలిచేందుకు ఆసక్తి చూపుతున్నట్టు తెలుస్తున్నది. ముఖ్యమంత్రి ఆదేశిస్తే కాంగ్రెస్ మద్దతుతో బరిలో నిలిచేందుకు తన ప్రయత్నాలు ప్రారంభిచినట్టు సమాచారం.

పెరగనున్న ఓట్లు

పాత కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల పరిధిలో జరిగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ.. మొత్తం 15 కొత్త జిల్లాలకు విస్తరించి ఉన్నది. అందులో 13 జిల్లాలు పూర్తిస్థాయిలో ఉండగా, జయశంకర్ భూపాలపల్లి జిల్లాతోపాటు హన్మకొండ (2019 ఎన్నికల సమయంలో వరంగల్ అర్బన్‌గా ఉన్నది) జిల్లాలు పాక్షికంగా ఉంటాయి. 2019 ఎన్నికల సమయంలో 23,214 ఓట్లు ఉండగా, అందులో 7,322 మంది మహిళా టీచర్లు, 15,892 మంది పురుష ఉపాధ్యాయులున్నారు. ఈసారి

జిల్లా	పురుషులు	మహిళలు	మొత్తం
ఆదిలాబాద్	1129	425	1554
జగిత్యాల	1027	347	1374
జయశంకర్ భూపాలపల్లి	102	41	143
కామారెడ్డి	1338	616	1954
కరీంనగర్	2130	1067	3197
కుమ్రంభీం	352	141	493
మంచిర్యాల	948	488	1436
మెదక్	768	379	1147
నిర్మల్	1284	454	1738
నిజామాబాద్	1975	1049	3024
పెద్దపల్లి	578	357	935
రాజన్నసిరిసిల్ల	600	183	783
సంగారెడ్డి	1480	864	2344
సిద్దిపేట	2061	871	2932
వరంగల్ అర్బన్ ప్రస్తుతం:హన్మకొండ	120	40	160
మొత్తం	15,892	7322	23,214

దాదాపు మూడు నుంచి ఐదు వేల ఓట్లు పెరిగే అవకాశమున్నట్టు తెలుస్తున్నది. గత ప్రభుత్వ హయాంలో గురుకులాలు, విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో జరిగిన రిక్రూట్‌మెంట్ల నేపథ్యంలో ఈ సారి ఓటర్ల సంఖ్య పెరుగుతుందని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఇప్పటికే ఆశావహులు తమ ప్రయత్నాలు ప్రారంభించడమే కాకుండా, తమకు దగ్గర అనుకున్న వారితో ఎన్‌రోల్‌మెంట్ చేయించేందుకు.. ఒక ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తున్నారు. అంతేకాదు, ఉపాధ్యాయసంఘాలు సైతం తమ మద్దతుతో బరిలో నిలిచే వారినే గెలిపించేందుకు పక్కా వ్యూహరచన చేస్తున్నాయి. దీంతో అప్పుడే ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి సంబంధించి ఉపాధ్యాయ వర్గాల్లో జోరుగా చర్చ నడుస్తున్నది. గతంతో పోలిస్తే ఈ సారి పోటీ కూడా అధికంగా ఉండే నేపథ్యంలో ఉపాధ్యాయులు ఎవరికి పట్టం కడుతారన్నది వేచి చూడాలి.

₹35.60 లక్షలతో అలంకరణ

కరీంనగర్ కమాన్‌చౌరస్తా, సెప్టెంబర్ 14 : నవరాత్రోత్సవాల్లో భాగంగా నగరంలోని విద్యానగర్‌లో వినాయకుడిని కరెన్సీతో అలంకరించారు. ప్యారిస్ లైన్ శ్రీ ఉమాపుత్ర ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ₹35.60 లక్షల నోట్లతో మండపాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. ఈ అలంకరణ ఆదివారం వరకు ఉంటుందని ఉత్సవ కమిటీ చైర్మన్ కోట సతీశ్ కుమార్ తెలిపారు. గతేడాది ₹20 లక్షల కరెన్సీతో అలంకరించినట్టు గుర్తు చేశారు.

రామగుండానికి 'వందేభారత్ రైలు'
రేపటి నుంచే ప్రారంభం

జ్యోతినగర్(రామగుండం), సెప్టెంబర్ 14 : రామగుండం రైల్వేస్టేషన్ మీదుగా సోమవారం నుంచి వందే భారత్ రైలు పరుగులు పెట్టబోతున్నది. నాగ్‌పూర్ నుంచి సికింద్రాబాద్ మధ్య నడిచే ఈ రైలు ప్రతి రోజూ రామగుండంలో హాల్టింగ్ కానున్నది. ఈ మేరకు సోమవారం ప్రధాని మోదీ పచ్చజెండా ఊపి రైలును ప్రారంభించనుండగా, అదే రోజు రాత్రి 8.20 గంటలకు రామగుండం రైల్వేస్టేషన్ రెండో ప్లాట్ ఫాంకు రానున్నది. ఈ మేరకు రైలు ప్రారంభోత్సవ ప్రత్యక్ష ప్రసారాకి రైల్వే అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా, వందే భారత్ రైలు ప్రతిరోజూ రెగ్యులర్‌గా నాగ్‌పూర్ నుంచి సికింద్రాబాద్‌కు వరకు ప్రయాణిస్తుంది. నాగ్‌పూర్ నుంచి ఉదయం 5 గంటలకు బయలుదేరి ఉదయం 9:08 గంటలకు రామగుండానికి చేరుకుంటుంది. ఇక్కడి నుంచి మూడు గంటల్లో సికింద్రాబాద్‌కు మధ్యాహ్నం 12.15 గంటలకు రీచ్ అవుతుంది. రామగుండం నుంచి సికింద్రాబాద్ ప్రయాణానికి ఒకరికి చైర్‌కార్‌లో రూ.765, వీఐపీ ఎగ్జిక్యూటివ్ కేటగిరీలో రూ.1,420 చొప్పున టికెట్ చార్జీలు నిర్ణయించారు. అయితే, తిరుగు ప్రయాణ టైంటేబుల్ మాత్రం ఇంకా ఖరారు చేయలేదు. సోమవారమే విడుదల చేసే అవకాశం ఉంది.

మహిళలను మహరాణులను చేస్తున్నాం



పెద్దపల్లి: మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వేదికపై మంత్రి శ్రీధర్‌బాబు, ఎంపీ వంశీకృష్ణ, ఎమ్మెల్యేలు విజయరమణారావు, మక్కాన్‌సింగ్

- కాచాపూర్‌లో సోలార్ పవర్ ప్లాంట్
- నందిమేడారంలో రైతులందరికీ ఉచిత సోలార్ పంపుసెట్లు
- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

పెద్దపల్లి, సెప్టెంబర్ 14(నమస్తే తెలంగాణ)/ పెద్దపల్లి టౌన్/ ధర్మారం/ పెద్దపల్లి రూరల్ : మహిళలను మహరాణులను చేస్తున్నామని, అందులో భాగంగా ఏడాదికి ₹20 వేల కోట్ల వడ్డీ లేని రుణాలను ఇస్తున్నామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. వచ్చే ఐదేళ్లలో ₹లక్ష కోట్ల వడ్డీ లేని రుణాలను ఇవ్వడంతోపాటు మహిళా సంఘాలతో సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేయించే కార్యక్రమానికి శ్రీకారం చుడుతామని చెప్పారు. శనివారం ఆయన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో కలిసి ధర్మారం మండలం కటికెనపల్లిలో 33/11 కేవీ సబ్‌స్టేషన్, జూలపల్లి మండలం కాచాపూర్‌లో 132/33 కేవీ సబ్ స్టేషన్, పెద్దపల్లి మండలం రాఘవపూర్‌లో ఎన్పీడీసీఎల్ ఎస్ఈ ఆఫీస్, రంగాపూర్‌లో 33/11 కేవీ సబ్ స్టేషన్, పెద్దపల్లి పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ ఆవరణలో 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్, పెద్దపల్లి ఆర్డీవో కార్యాలయ భవనం, అమృత్ 2.0 కింద తాగునీటి పథకం, టీయూఎఫ్ఐడీసీ కింద మొత్తంగా ₹85 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు నిర్మాణంలో వెల్గటూర్ మండలానికి చెందిన భూములు కోల్పోయిన 126 మందికి ₹18 కోట్ల విలువైన జంబో చెక్కును అందజేశారు. ధర్మారంలోని మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంతోపాటు పెద్దపల్లిలోని జెండా చౌరస్తాలో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని కాచాపూర్‌లో మహిళా సంఘాలతో సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈ విద్యుత్‌ను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని తెలిపారు. అందుకు గాను కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేసినట్లు వివరించారు. జిల్లాలోని చివరి ఆయకట్టు వరకు సాగు నీటిని అందించేందుకు ₹10 వేల కోట్లతో పత్తిపాక రిజర్వాయర్ నిర్మిస్తామని, ఒక పైలెట్ ప్రాజెక్టు కింద నందిమేడారం తీసుకొని ఇక్కడి రైతులందరికీ ఉచిత సోలార్ పంపుసెట్లు అందించడంతోపాటు విద్యుత్ ఉత్పత్తి చేపట్టి గ్రిడ్‌కు అనుసంధానం చేసి ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. 2029-30 నాటికి థర్మల్ పవర్ మాత్రమే కాకుండా గ్రీన్, హైడ్రో, ఫ్లోటింగ్ సోలార్, సోలార్ పవర్ మొత్తంగా 50 వేల మెగావాట్ల కరెంట్ ఇచ్చే ఆలోచనలో ఉన్నామన్నారు. రామగుండంలో 800 మెగావాట్ల థర్మల్ పవర్ ప్లాంట్ మంజూరు చేశామని, అతి తొందర్లోనే భూమి పూజ చేస్తామన్నారు. పత్తిపాక రిజర్వాయర్‌ను బడ్జెట్‌లో పెట్టి నిధులు ఇచ్చామని, సర్వే పూర్తి కాగానే ప్రారంభిస్తామని, పాలకుర్తి లిఫ్ట్, బండల వాగు లిఫ్ట్ కోసం సబ్ స్టేషన్లు మంజూరు చేసి, మరో 30 వేల ఎకరాల సాగు పెంచుతామన్నారు. పెద్దపల్లి, సుల్తానాబాద్‌లో బైపాస్ రోడ్లు నిర్మిస్తామన్నారు. రైతుల సంక్షేమమే తమ ప్రభుత్వ ధ్యేయమని ఆ దిశగా సీఎం రేవంత్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. ఇచ్చిన వాగ్దానం ప్రకారం ₹2 లక్షల రుణమాఫీకి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, అందులో భాగంగానే ₹18 వేల కోట్లు ఏక కాలంలో మాఫీ చేశామని చెప్పారు. ఇంకా కొంతమందికి కావలసి ఉందని బ్యాంకుల్లో సాంకేతిక కారణాలవల్ల జాప్యం జరుగుతుందని వివరించారు.

మార్పుతీసుకువస్తున్నాం

ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

తమ మంత్రి వర్గమంతా సమష్టిగా పనిచేస్తూ కేవలం ఎనిమిది నెలల్లోనే మార్పు తీసుకువస్తున్నామని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. అసలు రాష్ట్రంలో విద్యుత్ ఉత్పాదక కేంద్రాలను అప్పుడు, ఇప్పుడు ఏర్పాటు చేసింది కాంగ్రెస్ పార్టీనేనని, పత్తిపాకను పూర్తి చేస్తామని, టాస్క్ బిల్డింగ్‌ను పూర్తి చేశామని చెప్పారు. పెద్దపల్లి నియోకవర్గంలో ఇళ్లు లేని 3500 మందికి ఈ యేడాది అందిస్తామన్నారు. ఓదెల మానేరుపై వంతెన నిర్మిస్తామని చెప్పారు. పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ మాట్లాడుతూ ప్రజల ఆశీర్వాదంతో గొప్పగా పనిచేసే అదృష్టం లభించిందన్నారు. ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ఎల్లంపల్లి ప్రాజెక్టు నిర్వాసితుల్లో 18 ఏళ్లు నిండిన యువకులకు ఇచ్చే పరిహారం, ఇంకా ఇతర నిర్వాసితులకు రావాల్సిన ₹8 కోట్లు విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు చింతకుంట విజయ రమణారావు, రాజ్ ఠాకూర్ మక్కాన్‌సింగ్, రాష్ట్ర ప్రభుత్వ ప్రొటోకాల్ చైర్మన్ హర్కర వేణుగోపాల్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.